యథేచ్ఛగా మొరం తవ్వకాలు

- చెరువులను వదలని అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



పొక్లెయినర్‌తో తవ్వుతున్న కొత్త చెరువు కట్ట మొరం

టేకుమట్ల: ధనార్జనే ధ్యేయంగా మండలంలో కొంత మంది ప్రభుత్వం, అటవీ, చెరువుల్లో మొరం తవ్వకాలు చేపడుతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని పగలూ రాత్రి అనే తేడా లేకుండా అధికారుల కళ్లు గప్పి మొరం తవ్వకాలను చేపట్టి సొమ్ము చేసుకున్నారు. అందులో భాగంగానే మండలంలోని అంకుషాపూర్ శివారు పంట పొలాల్లోకి వెళ్లే దారి గుండా ఇసుక ట్రాక్టర్ల రవాణా వల్ల దారి పూర్తిగా ధ్వంసం కాగా ఇటీవల తహసీల్దార్‌కు మొరం కావాలంటూ అనుమతి తీసుకున్నారు. అందుకు అవకాశం కల్పించడంతో మండలంలోని కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం వద్ద గల కొత్త చెరువు కట్టను పొక్లెయినర్ సహాయంతో శుక్రవారం తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇతర అవసరాలకు మొరం తరలించుకున్నారు. దాంతో కట్ట తవ్వకాన్ని స్థానికులు అడ్డుకోగా అడ్డుకునేందుకు వెళ్లగా మీరెవరంటూ, తమ శివారులో కట్టను ఏమైనా చేసుకుంటామంటూ మొరాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అక్కడికి చేరుకుని కట్ట తవ్వకాన్ని నిలిపి వేయాలంటూ అభ్యంతరం తెలుపడంతో కాసేపు గొడవ సద్దుమనిగింది. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేయలేని అచేతన స్థితిలో ఉందని, మండలంలో అక్రమ మొరం తవ్వకాలపై ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోని మొరం తవ్వకాలు నిలిపివేసే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొరం తవ్వకాన్ని అడ్డుకున్నాం...

రైతుల పంట పొలాలకు వెళ్లేదారి కోసం కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం వద్ద కట్ట వద్ద మొరం తవ్వకాలు చేపట్టిన సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకుని మొరం తవ్వకాన్ని అడ్డుకున్నాం. ఎక్కడైనా అక్రమంగా చెరువుల్లో తవ్వకాలు చేపడితే చర్య తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, ఐబీ ఏఈ

క్లుప్తంగా

కోడి పందేల శిబిరంపై దాడి

పలిమెల: కోడి పందేలు ఆడుతున్న శిబిరంపై దాడి చేసి పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముకునూర్ గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో పలువురి అదుపులోకి తీసుకున్నట్లు వారి వద్ద నుంచి వాహనాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో సివిల్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చిట్యాల: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ మల్లేశ్ తెలిపారు. ఆటో, టాటా మ్యాజిక్‌లకు డ్రైవర్లకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. అనంతరం ఆటో, టాటా మ్యాజిక్ వాహనాలకు సీరియల్ నంబర్‌లు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రావన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

రేగొండ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నేడు (శనివారం) సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాద్‌రావు తెలిపారు. ఈ ప్రజావేదికలో ఉపాధీ హామీ పథకం కింద జరిగిన పనులపై తనిఖీ నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: 33 కేవీ కాటారం, ధన్వాడ సబ్‌స్టేషన్‌ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్ శుక్రవారం ఒక ప్రకనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాలో విశిష్టసేవలు అందిస్తున్న వయోవృద్ధుల సంస్థలకు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 1న పురస్కారాలు అందించేందుకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 25లోపు దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని కలెక్టర్ కార్యాలయంలోని సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 96523 11804 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల నాయకుడు మంథని రాజేందర్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మహదేవపూర్ గ్రామ నివాసులు (ప్రస్తుతం) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఠాకూర్ మహేందర్ సింగ్ రూ.75వేల నగదును అందజేశారు. ఆయన స్నేహితులు సంతోష్ సింగ్, మల్లికార్జున్‌ల సహకారంతో శుక్రవారం ఠాకూర్ మహేందర్ సింగ్ తల్లిదండ్రుల చేతుల మీదుగా సాయం వారికి అందించారు. ఈ కార్యక్రమంలో అయిలి సాంబమూర్తి, తడకల శ్రీనివాస్, కొంతం సంపత్, అభిషేక్, బల్ల శ్రావణ్ కుమార్, సంతు పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ సామాజిక ఆస్పత్రి ఉద్యోగులతో పాటు ఇతరులు అక్రమంగా క్వాటర్స్‌లో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు బెల్లంపల్లి సురేష్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ విషయంపై ప్రభుత్వాన్ని పక్కతోవపట్టిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. నిరుపయోగంగా ఉన్న క్వాటర్స్‌లో సిబ్బంది తిష్ట వేసి ప్రభుత్వానికి గృహ నివాస ఖర్చులు చెల్లించకుండా పక్కదా రి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా ఇతరులు కూడా నివాసం ఉంటున్నారని వారిపై చర్య తీసుకోవాలన్నారు.

ఫోన్ అప్పగింత

కన్నాయిగూడెం: మండలంలోని చిట్యాలకు చెందిన రాంబాబు ఇటీవల ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీ ఈఐఆర్ సాయంతో ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి ఎస్సై వెంకటేష్ శుక్రవారం అందజేశారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్



ఎన్‌సీసీ విద్యార్థులతో కల్నల్ సెంథిల్ రామాదురై

మొగుళ్లపల్లి: ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సెంథిల్ రామాదురై అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ యూనిట్‌ను ఆయన సందర్శించి ఎన్‌సీసీ శిక్షణకు కావలసిన మౌలిక సదుపాయాలు, రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పలు సూచనలు చేసి ప్రధానోపాధ్యాయుడు, ఎన్‌సీసీ అధికారి రాజయ్యను అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థిని విద్యార్థులకు, క్రమశిక్షణ దేశభక్తి, సోదరభావం, నాయకత్వ లక్షణాలు, శారీరక మానసిక ఆధ్యాత్మిక, జీవన విలువలతో కూడిన అంశాలను రెండేళ్లలో శిక్షణ ఇస్తారన్నారు. వీటితో పాటు డ్రిల్లు ఆయుధ వినియోగం, ఆర్మీ జీవితం ఎలా ఉంటుందో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వీటితోపాటు ఏ సర్టిఫికెట్ ఉపయోగాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఉన్నత చదువులకు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉపయోగపడుతుందని సూచించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పింగిలి విజయ్ పాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం ఎన్‌సీసీ విద్యార్థులతో కమాండింగ్ ఆఫీసర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బెటాలియన్ అధికారి ప్రేమ్‌శంకర్ సొరస్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నూనెటి ఐశ్వర్య(9వ తరగతి), శనిగరపు భరత్(10వ తరగతి) రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 21, 22, 23న రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు రాధిక రాణి , మమత, ఉమరాణి, రంజిత్‌కుమార్, రూపశ్రీ, రఫీ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రయ్య

కాటారం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని డీఎల్‌పీఓ వీరభద్రయ్య అన్నారు. కాటారం మండలం ధన్వాడ గ్రామ పంచాయతీని శుక్రవారం డీఎల్‌పీఓ సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి గ్రామంలో కొనసాగుతున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని పరిశీలించి ఇంటింటికి అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయడం, పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగింపు, మురుగు నీరు నిల్వకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

అంబులెన్స్‌ను కేటాయించాలి

మొగుళ్లపల్లి: మండలానికి అంబులెన్స్‌ను ప్రభుత్వం కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 25 గ్రామాల్లో ప్రజలు ఆపద సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల మండల కేంద్రం నుంచి 108 వాహనం వచ్చేసరికి సమయం పడుతుండడంతో అత్యవసర పరిస్థితిలో బాధితులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో చిట్యాల సామాజిక వైద్యశాలకు చికిత్స కోసం వెళ్తున్నారన్నారు. సంబంధిత అధికారులు, కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి పాత మండలమైన మొగుళ్లపల్లికి నూతన 108 వాహనం కేటాయించాలని ఆయనన్నారు.

పుస్తక పఠనం ఎంతో అవసరం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి సంజీవరావు

కాటారం: ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుందని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు చదివి ఉన్నతులుగా తయారు కావాలని సూచించారు. గ్రంథాలయానికి కావాల్సిన గ్రంథాలు, పుస్తకాలను స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలకు బహూకరిస్తానని ప్రత్యేకాధికారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షం

కాళేశ్వరం: మహదేవపూర్, కాళేశ్వరం తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కాళేశ్వరం: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని ముస్లింలు శుక్రవారం కాళేశ్వరంలో శాంతిర్యాలీ నిర్వహించారు. జామ మసీద్ నుంచి నిర్వహించిన ర్యాలీలో ముస్లింలు పాల్గొన్నారు. అంతకుముందు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త సందేశాన్ని చదివి వినిపించారు. మహ్మద్ ప్రవక్త బాటలో నడువాలని మతపెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ సదర్ సయ్యద్ సమద్, నాయబ్ సదర్ షేక్ జానీ, కమిటీ అధ్యక్షుడు నూరేముజస్సం, వైస్ ప్రెసిడెంట్ రయాన్ ఖాన్, మసీద్ ఇమామ్ సయ్యద్ నిసార్, మౌజన్ శఫీఖ్ పాల్గొన్నారు.

సుపరిపాలన బీజేపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్య

భూపాలపల్లి రూరల్: దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు జన్నె మొగిళి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ రూరల్ కన్వీనర్ విప్లవకుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల రాజేందర్, వేణు, రవిరాజు, స్వామి, దామోదర్‌రెడ్డి, మహేందర్, సురేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల సభ్యత్వ నమోదు ప్రభారి వెన్నెంపల్లి పాపయ్య అన్నారు. శుక్రవారం మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్ స్థాయిలో 200 సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. మండలంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసి జిల్లాలో ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, జిల్లా నాయకులు మేతుకుపల్లి బుచ్చిరెడ్డి, గస్‌రెడ్డి లింగారెడ్డి, సరోత్తమ్‌రెడ్డి, సుధాకర్, కొడగాని రాకేష్, రాజు, శ్రీను, నరహరి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని కళాశాలల విద్యార్థులు యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడలశాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి రఘు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువటూరిజం క్లబ్‌ల ఏర్పాటుపై విద్యార్థులతో సదస్సు ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు, జిల్లాస్థాయి నోడల్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన వివిధ కళాశాలలు, పాఠశాలల కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25లోపు యువ టూరిజం క్లబ్‌లను జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయాలని కోరారు. విద్యార్థులు టూరిజాన్ని కెరియర్‌గా మలుచుకొని ఉపాధిని పొందాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీఓ సుమనవాణికి వినతిప్రతం అందజేసి మాట్లాడారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయల్లో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ డీజిల్ పోసేందుకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు రవి, చందర్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలి

ఏటూరునాగారం: గ్రామాల్లో రోజువారికార్యకలాపాలకు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీలకు నిధులు కేటాయించాలని కార్యదర్శులు ఎంపీడీఓ రాజ్యలక్ష్మిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రానున్న బతుకమ్మ, దసరా పండుగలకు గ్రామపంచాయతీల ద్వారా పలు కార్యకలాపాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



గోదావరి ఫెర్రీ పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఐ రాంచందర్‌రావు

పలిమెల: మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడం, గోదావరి తీరప్రాంతం ఉండటంతో పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహదేవ్‌పూర్ సీఐ రాంచందర్‌రావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన పలిమెల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లో సిబ్బంది చేస్తున్న విధులను పరిశీలించారు. మండలంలోని సర్వాయిపేట, దమ్మూరు, బూరుగుగూడెం, నీలంపల్లి, బండారిగూడెం, ముకునూర్ గ్రామాలను ఆనుకొని అనంతరం మావోయిస్టులు దాటడానికి అనుకూలంగా ఉన్న ఫెర్రీ పాయింట్లను తనిఖీ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి సూచించారు. మత్స్యకారులు, పడవలు నడిపే వారితో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలిమెల ఎస్సై తమాషారెడ్డి, సివిల్, టీఎస్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



పలిమెల: మాట్లాడుతున్న శివరాణి



చిట్యాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పలిమెల: గర్భిణులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివరాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని బూరుగుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలోని నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతల మహిళలలు రక్తహీనత నివారణకు సమతుల ఆహారం, చిరుధాన్యాలు తీసుకోవాలని, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ప్రీ స్కూల్ నూతన విద్యా విధానంలో భాగంగా పిల్లలకు కొత్త సెలబస్‌ని సులభంగా అర్థమయ్యే విధానంలో రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల వయస్సు తగిన బరువు, ఎత్తు ఉండే విధంగా పౌష్టికాహారం అందిస్తూ గృహసందర్శనలు ద్వారా సూచనలు సలహాలు అందిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పొందే ప్రయోజనాలు అందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవి, అంగన్‌వాడీ టీచర్స్ శివమ్మ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రోత్‌మేళా పోషణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ రామకృష్ణ, డాక్టర్ బాలకృష్ణ హాజరై మాట్లాడారు. పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత వంటి పలు సూచనలు చేశారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు ఆరోగ్య పరీక్షలు డివామింగ్ టాబ్లెట్‌స విటమిన్ ఏ ద్రావం గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్ మంజుల, కవిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి, వెలిశాల, పండిగిపల్లి, బండపల్లి గ్రామాలకు చెందిన పలువురు అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం వారి కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళ్లర్పించి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి, తోడేటి కుమార్, మోతె రాజమౌళి, కత్తి సంపత్, మాదం కొమురయ్య, స్వామిరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



దామారంచపల్లిలో సోలార్ సీసీ కెమెరా అందజేస్తున్న కిరణ్



కాళేశ్వరం: మాట్లాడుతున్న ఎస్సై చక్రపాణి

రేగొండ(కొత్తపల్లిగోరి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండలంలోని దామారంచపల్లిలో సీసీ కెమెరాల ఆవశ్యకతను ఎస్సై ప్రజలకు వివరించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతలను కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మొట్టి కిరణ్ సోలార్ సీసీకెమెరాను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జూపాక నీలాంబరం, పీఏసీఎస్ డైరెక్టర్ బొట్ల మధుసూదన్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, నాయకులు బొట్ల రవిసామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ముఖ్యం

కాళేశ్వరం: సీసీ కెమెరాలతో నేర నియంత్రణ సాధ్యమని, నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు పోలీసులాగా ముఖ్యపాత్ర పోషిస్తాయని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి అన్నారు. అన్నారం గ్రామస్తులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటులో ప్రజలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పంపిణీ చేసిన సబ్బులు చూపిస్తున్న విద్యార్థులు

గోవిందరావుపేట: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కార్పెడ్ సంస్థ ప్రతినిధి ఎండీ షఫీ అన్నారు. డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా గ్రామాలయ, కార్పెడ్ సంస్థల ఆధ్వర్యంలో చల్వాయిలోని కేజీబీవీ విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై కార్పెడ్ సంస్థ ప్రతినిధి ఎండీ షఫీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా చేతులను సబ్బుతో 20 నుంచి 40 సెకండ్ల వరకు శుభ్రంగా కడగాలని తెలిపారు. విద్యార్థులందరికీ ఉచితంగా డెటాల్ సబ్బులను ఎస్ఓ వెంకటలక్ష్మీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులచే స్వచ్ఛ విద్యాలయ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కార్పెడ్ సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.